

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

అల్లాపూర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లయన్స్ క్లబ్ ఆఫ్ పర్యావరణ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నెం కోటిరెడ్డి అన్నారు. వ్యాపార సముదాయాలు, రైతు మార్కెట్లలో వినియోగదారులకు జ్యూట్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. కోటిరెడ్డి మాట్లాడుతూ..పర్యావరణాన్ని హాని చేసే ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, జూట్ బ్యాగులను వాడాలని సూచించారు.

### చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు

దుండిగల్ : ఈ నెల 24 నుంచి మే 20 వరకు నిజాంపేటలోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనంపై వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు స్కూల్ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు తెలిపారు. నిజాంపేట్, బాలాజీ నగర్ లోని కృష్ణారెసిడెన్సీ నందు సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో ఐదేండ్ల నుంచి పెద్దవారి వరకు నేర్చుకోవచ్చు అని తెలిపారు. వివరాలకు 9959971679 / 9849490663 నంబర్ లలో సంప్రదించా లని సత్యవోలు రాంబాబు కోరారు.

# వరంగల్ సభకు తరలుదాం



గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ లోని జిల్లా తెలంగాణభవన్‌లో చలో వరంగల్ పోస్టల్ ఆవిష్కరిస్తున్న మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ నరసింహయాదవ్

దుండిగల్ : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని 27 న వరంగల్ లో నిర్వహించే వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి వెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద పిలుపునిచ్చారు. గాజుల రామారం డివిజన్ యండమూరి ఎన్‌క్లేవ్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభివృద్ధికి నోచుకోకుండా అడుగడుగునా వివక్షణకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర సాధన ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి 2001 లో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటుచేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన రాష్ట్రాన్ని దేశంలోనే నం.1 స్థాయిలో నిలిపిన పార్టీ బీఆర్ఎస్ అని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చిన నాయకులు మన అధినేత కేసీఆర్ అని అన్నారు.

కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకుడు కస్తూరి బాల్ రాజ్, అద్వకేట్ కమలాకర్, డివిజన్ ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, యూత్ అధ్యక్షుడు తెలంగాణ సాయి, నాయకులు ఇమ్రాన్ బేగ్, మూసా ఖాన్, మక్సూద్, సుంకరి చందు, చెట్ల వెంకటేష్, ఆంజనేయులు, దూలప్ప, రంజాన్, మల్లారెడ్డి నగర్ ఫేస్ -2 అధ్యక్షుడు నాగభూషణం, మహిళా నాయకురాలు మామి, దుర్గా, ఊర్మిళ, సాజిద, అనిత పాల్గొన్నారు.

### గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం(తెలంగాణ భవన్)లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆదేశాల మేరకు సోమవారం ముఖ్య నాయకుల సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. చలో వరంగల్ పేరిట ముద్రించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలానగర్ : బీఆర్ఎస్ 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న జరుపతలపెట్టిన రజతోత్సవ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఫ్రెండ్స్ కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి వాల్ పోస్టర్లను అటించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయడానికి రజతోత్సవ సభ దోహద పడుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్రే జంగయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, లలిత, రాజ్ కుమారి, ఐలేశ్, చందర్, మట్టి శ్రీనివాస్, నగేశ్, రమేశ్ గౌడ్, పోచయ్య, పిట్ల రాజు ముదిరాజ్, యాదగిరి, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.



### హలో ఆల్విన్ .. చలో వరంగల్

27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు ప్రీతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ చాలీస్ మఖాన్‌లో చేపట్టిన ప్రచారయాత్రలో బీఆర్ఎస్ నాయకుడు సతీశ్‌రావు సోమవారం పాల్గొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సభకు తరలిరావాలని కోరారు. పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార పోస్టర్‌ను కాలనీలో ఆవిష్కరించారు.

- మియాపూర్

### విజయవంతం చేయాలి

శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవానికి నాయకులు, అభిమానులు తరలి రావాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా కోరారు. ఖాజాగూడలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడే పార్టీగా ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ నిలిచిందన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై పోరాటం చేస్తుందన్నారు. 27న నిర్వహించబోయే సభతో ప్రభంజనం సృష్టించబోతున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందన్నారు.


## ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు..



బాలానగర్ : ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేట మాల బస్తీ అబ్రార నగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ నరసింహ యాదవ్ పాద యాత్ర చేశా రు. తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు.అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అన్నా రు. కార్యక్రమంలో ఏఈ ఆశ, విద్యుత్ శాఖ అలైన్మెంట్ రామారావు, బీఆర్ఎస్ నియోజకవర్గం మైనార్టీ నాయకులు సయ్యద్ అజాజ్, యూసుఫ్, హర్షత్, చాంద్, అనీఫ్, అజర్, ఖదీర్, అప్సర్, ఉస్మాన్ పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు వెంటనే స్పందించాలి

మియాపూర్ : శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయంతోపాటు శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరుసర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 27 వినతులు అధికారులకు అందాయి. ఇందులో జోనల్ కార్యాలయంలో 8, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 11, యూసఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో 5, చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వచ్చాయి. పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్‌కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతి పత్రం రూపంలో అందించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ..ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జడ్సీ ఉపేందర్ రెడ్డి ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.



చందానగర్ కార్యాలయంలో అధికారులతో డీసీ మోహన్ రెడ్డి

### తక్షణమే చర్యలు తీసుకోవాలి

ప్రజావాణి కార్యక్రమం ప్రజల నుంచి వచ్చే వినతలపై తక్షణ చర్యలు తీసుకో వాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది పట్టణ ప్రణాళిక విభాగం సంబంధించి ఐదు, పన్ను, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి రెండు వినతులను స్వీకరించారు. డీసీ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన వినతులను రికార్డులలో నమోదు చేయాలని, సంబంధిత విభాగ అధిపతులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సమాచారం అందించాలని డీసీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీబీ నాగిరెడ్డి వైద్య అధికారి డాక్టర్ రవి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

### కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో..

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ కార్యాలయం అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 8, ఎలక్ట్రికల్ విభాగానికి 2, శానిటేషన్ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 1, ఫిర్యాదులు వచ్చాయని ఈ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 2, శానిటేషన్ భాగానికి 1 ఫిర్యాదులు వచ్చాయని డీసీ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 5 ఫిర్యాదులు రాగా.. వచ్చిన ఫిర్యాదులని టౌన్ ప్లానింగ్ విభాగానికే చెందినవని డీసీ తెలిపారు.



కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు



కేపీహెచ్‌బీ కాలనీ : చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి సీఐ రాజేశ్ అన్నారు. ఓమిని వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీఐ, వైద్యశాల సీఓఓ వారిస్ ప్రారంభించారు. ఎస్సై రామకృష్ణ, వైద్యశాల జీఎం శ్రీనివాస్, హెచ్ఆర్ విజయ్, ఆసిఫ్ ఖాన్, కృష్ణారెడ్డి, అశోక్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



### ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

జగద్గిరిగుట్ట ఏప్రిల్ 21: పనిఒత్తిడి ఉన్నా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ నరసింహ సిబ్బందికి సూచించారు. జగద్గిరిగుట్ట పోలీసులకు లలిత హాస్పటల్, ఎస్‌పీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యం లో సోమవారం ఏర్పాటు చేసిన మెడికల్ చెకప్‌ను ఆయన ప్రారంభించారు. ఎస్సైలు రాజేశ్, శంకర్, నాయకులు సయ్యద్ రషీద్, పున్నారెడ్డి, మహేశ్, పవన్, రోహిత్, మనోజ్, వంశీ, శ్రీకాంత్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బాలానగర్ : సైబరాబాద్ పోలీసులు తమదైన శైలిలో సేవలు అందిస్తున్నారని బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్ అన్నారు. నర్సాపూర్ చౌరస్తాలో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సూచనల మేరకు బాలానగర్ పీస్ ఆధ్వర్యంలోచలివేంద్రాన్ని బాలానగర్ ఏసీపీ హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బాలానగర్ సీఐ నరసింహరాజు, డీఐ నాగిరెడ్డి, ఎస్సైలు రామ్ నారాయణ, హాజీ మియా, సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట సమీపం లెనిన్ నగర్‌లో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రేవ్ యార్డ్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. 40 ఏండ్లుగా వినియోగిస్తున్నామని ఆ స్థలాన్ని తమకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, ఇబ్రహీం, మహమ్మద్ మోయిన్ పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప సమీపం కోణమహాలక్ష్మి నగర్లో సీసీ రోడ్లు వేయించాలని స్థానికులు కోరారు. ప్రజావాణిలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గుంతల రోడ్లతో సమస్యలు వస్తున్నాయన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

శేరిలింగంపల్లి : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసిన ఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన కడ్క బహదూర్(49) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. షాగౌస్ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తూ మధురానగర్ కాలనీలో ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బహదూర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కొడుకు కృష్ణ బహదూర్ ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. నేపాల్‌లో బహదూర్ ఇల్లు కట్టడానికి, భూమి కొనడానికి అప్పులు చేశాడని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# పెట్రేగుతున్న భూకబ్జాదారులు



మసీదు సమీపంలోనీ ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న భవనం



తెలంగాణ భవన్ సమీపంలో .. మరో భవనం

దుండిగల్ : గండి మైసమ్మ దుండిగల్ మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువవుతోంది. మండల రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి కబ్జాదారులకు వరంగా మారింది. వరుసగా మూడు నాలుగు రోజులు సెలవులు రావడంతో కబ్జాదారులు రెచ్చిపోయారు. ఏకంగా ప్రభుత్వ భూములల్లో నిర్మాణాలను రాత్రికి రాత్రి గదులు నిర్మించడం, సున్నం వేయడం, మనుషులను దించడం ఇక్కడ పరిపాటిగా మారింది అంటున్నారు స్థానికులు. కొందరు జర్నలిస్టుల ముసుగులో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతుండగా, అక్రమార్కులు జర్నలిస్టులే ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులు అందుతున్న సమయంలో అధికారులు వెళితే జర్నలిస్టులే అడ్డ పడుతున్నారని విమర్శలు లేకపోలేదు.

వివరాలలోకి వెళితే.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గండి మైసమ్మ -దుండిగల్ మండలం, డి. పోచంపల్లి లోని సర్వే నం. 120 లోని చంద్రశేఖర్ రెడ్డి నగర్, డాక్టర్ బస్తీ, మజీద్ సమీపంలో కొన్ని రోజులుగా ప్రభుత్వ స్థలాలను చెరబట్టిన అక్రమార్కులు ఏకంగా పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మసీద్ సమీపంలో ఓ వ్యక్తి 300 గజాల స్థలంలో జీ ప్లస్ వన్ నిర్మాణం చేపట్టాడు. గతంలో ఇక్కడ ఫంక్షన్ కోసం అంటూ టెంట్ వేసిన అక్రమార్కుడు నకిలీ పత్రాలు సృష్టించి నిర్మాణం చేపట్టడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు కూల్చివేసినప్పటికీ, శాశ్వత నిర్మాణం చేపట్టిన అతడికి ఓ జర్నలిస్టు అండదండలు ఉండడంతో అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ భవన్ సమీపంలో తాను జర్నలిస్టు అంటూ ఓ వ్యక్తి ఏకంగా మూడు అంతస్తుల భవనాన్ని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తూ ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్న అధికారులు చూడకపోవడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కిందిస్థాయి సిబ్బందితో అధికారులు వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో భూకబ్జాదారులు పెట్రేగిపోతున్నారని పలువురు వాపోతున్నారు. 58, 59 జీవోల ప్రకారం తమకు రెగ్యూలరైజేషన్ అయ్యిందని చెప్పుకుంటూ మస్కా కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డాక్టర్ బస్తీలో ఓ వ్యక్తి 700 గజాల్లో నిర్మాణాలు చేపట్టి అధికారులకు సవాలు విసురు తున్నాడనీ పలువురు పేర్కొంటున్నారు. అవినీతి, నిర్లక్ష్య వైఖరి కారణంగానే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఆర్డీవో స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఆక్రమణపై కలెక్టర్ దృష్టి సారించి కాపాడాల్సిన అవసరం ఉందనీ పలువురు అభిప్రాయ పడుతున్నారు.

### జేసీబీ లేదు మేమేం చేయాలి..? గిర్దావర్ ఎదురు ప్రశ్న..!

ఇదే విషయమై తాసిల్దార్ మతిన్ ను వివరణ కోరేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ అన్వేష్‌ను వివరణ కోరగా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలను రక్షించాలని తమకు ఉందని సమాధానం ఇచ్చారు. ఇక్కడ ఏం జరుగుతుందో మీకు కూడా తెలుసు కదా..! అంటూ దాటవేత ధోరణి ప్రదర్శించాడు. పైగా సదరు అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు జేసీబీ దొరకటం లేదు. మమ్మల్ని ఏం చేయమంటావ్.. అంటూ ఎదురు ప్రశ్నించడం గమనార్హం.



చంద్రశేఖర్ రెడ్డి నగర్ లోని 700 గజాల స్థలంలో నిర్మాణాలు చేపట్టిన దృశ్యం


### ప్రభుత్వ భూములను అప్పజెప్పిన అధికారులను శిక్షించాలి

మాదాపూర్, ఏప్రిల్ 21: వందల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నారాయణ అన్నారు. కొండాపూర్‌లోని వసంత సిటీ సమీపంలోని సర్వే నం.79 లో 39 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో రెండు రోజుల క్రితం హైడ్రా అధికారులు వాటిపై చర్యలు తీసుకోవడంతో సోమవారం సీపీఐ నారాయణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సమితిసభ్యులు చందు యాదవ్, తుపాకుల రాములు, కొండలయ్య, శ్రీనివాస్, నారాయణ, రఘు పాల్గొన్నారు.



సర్వే నంబర్ 79,39 లోని భూములను పరిశీలించిన సీపీఐ నారాయణ

## సమాజంలో ఉపాధ్యాయులు కీలకం



జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 21: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల విద్యాధికారి జెమినీ కుమారి అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గురుమూర్తి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ సుదర్శన్ పదవీ విరమణ సభ గాంధీనగర్‌లో సోమవారం నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంఈఓ ఆంజనేయులు, ఉపాధ్యాయులు జయసింహారెడ్డి, వెంకట రాములు, ఎంఎల్ఓ రమేశ్, నాయకులు శంకరయ్య, సత్యనారాయణ ,శివకుమార్, తారకరాణి పాల్గొన్నారు



బాలానగర్ : ఫతేనగర్ డివిజన్లో శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ పేర్కొన్నారు. జవహర్ నగర్ కాలనీకి సమీపంలో ఉన్న ముదిరాజ్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ. 15 లక్షలతో శ్రీకారం పెట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో కలిసి పాదయాత్ర చేసిన సమయంలో గుర్తించిన సమస్యలకు పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు.

## ఆశ్రమ వాసుల సౌకర్యార్థం సిమెంట్ రోడ్



సీఆర్ ఫౌండేషన్‌లో రోడ్డు నిర్మాణం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు నారాయణ

మాదాపూర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ లో సీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న హోం ఫర్ ఏజ్డ్ కు మల్లంపాటి సోదరుల ఆర్థిక సహాయంతో సిమెంట్ రోడ్ నిర్మించారు. సోమవారం సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, డా. కే నారాయణ హాజరై అగస్త్య ఆగ్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లంపాటి మురళి, మల్లంపాటి వెంకటేశ్వరరావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చల్ల రాజేశ్వరరావు ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించడం సంతోషాన్నిచ్చిందని అన్నారు. కార్యక్రమంలో సి ఆర్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు ఎన్.రాజేంద్ర రావు, సీఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ వి.చెన్నకేశవరావు, టి. తన్య, డాక్టర్ గోపీచంద్, సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, మిసిబి మాసపత్రిక ఎడిటర్ వల్లభనేని అశ్విని కుమార్, ఆశ్రమవాసులు, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.